క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి



మధుసూదన్‌రెడ్డితో నాయకులు

శంకర్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి విజయం సాధించాలని సూచించారు. ఆయనను కలిసిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ కాడిగారి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి

చేవెళ్ల: ప్రతీ వ్యక్తి తమ జీవనశైలిలో మార్పులు చేసుకుంటే వ్యాధులు ధరిచేరవని డా.విమలాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దేవునిఎర్రవల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిమ్స్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన వారికి జీర్ణవ్యవస్థ కేన్సర్‌ను నిర్ధారించే అన్ని రకాల పరీక్షలు చేశారు. అనంతరం విమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగానే జీర్ణవ్యవస్థ కేన్సర్లు వస్తాయని, వాటిని మార్పులు చేసుకుంటే మంచిదన్నారు. శరీరంలో ఎలాంటి మార్పులు కన్పించినా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో డా.దినేశ్‌రెడ్డి, డా.రోహన్‌రెడ్డి, డా.గౌరాంగ్, డా.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌కు శుభాకాంక్షలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చెన్నయ్య

షాద్‌నగర్‌రూరల్: పీసీసీ చీఫ్‌గా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పాఠశాలల క్రీడల, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆయన శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహేశ్‌కుమార్‌గౌడ్ భవిష్యత్‌లో మరిన్నీ ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

యాచారం: బీఆర్‌ఎస్ సర్కార్ మాదిరిగానే ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తోందని, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే బీరప్ప ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2021 నుంచి నేటి వరకు ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు రాక పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఏర్పడిందన్నారు. నిధులు మంజూరు కాకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మీర్‌పేట: సెప్టెంబరు 30న ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న పీడీఎస్‌యూ 50వ వసంతాల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పీవైఎల్ (ప్రోగ్రెసివ్ యూత్ లీగ్) బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూర్ భీమేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో స్వర్ణోత్సవ సభ వాల్‌పోస్టర్‌లను పీవైఎల్ సభ్యులు ఆవిష్కరించారు. నవ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. పీడీఎస్‌యూ కోట్లాది మంది విద్యార్థులకు మార్గదర్శమైందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కారేమోల రాకేశ్, సభ్యులు శంకర్, మహేశ్, ప్రవీణ్, నరేందర్ పాల్గొన్నారు.

రైతుల ఆశలపై నీళ్లు



మల్లారెడ్డిగూడలో ఎర్రబారిన పత్తి పంట



మరియాపూరంలో అధిక వర్షాలకు ఎండిపోయిన పత్తి పంట

- ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి పంటకు నష్టం
- పూత, కాయరాలి ఎర్రబారుతున్న చేలు
- పెట్టుబడులు రాని దుస్థితి.. ఆందోళనలో రైతులు

షాబాద్: ఆరుగాలం కష్టించే రైతులు అడుగడునా కష్టాల పాలవుతున్నారు. ఓ పక్క అతివృష్టి, మరో పక్క అనావృష్టితో అతలాకుతలం అవుతున్నారు. ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వానలు పత్తి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. పత్తిపంట పూర్తిగా దెబ్బతిన్నది. చేలల్లో నీరు నిలిచి పూత, కాయలు రాలిపోవడంతో పాటు మొక్కలు మురిగిపోయాయి. కొన్నిచోట్ల పత్తి పంట ఏపుగా ఎదిగినా బెల్లం తెగులు, ఎర్రబొమ్మిడి సోకడంతో పత్తి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 5.4 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేశారు.

ఈ ఏడాది ముందుగానే సాగు...

ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా మృగశిర కార్తెలోనే రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఈ కార్తెలో సాగునీరు అవకాశం ఉన్న రైతులు మాత్రమే పంటను ఎక్కువగా సాగు చేస్తారు. అయితే వర్షాలు కూడా ముందుగానే పడటంతో చాలా మంది విత్తనాలు వేశారు. ఆ తర్వాత వర్షాలు మొహం చాటేయడంతో విత్తిన విత్తనాలు కూడా మొలకెత్తకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో రెండోసారి విత్తనాలను విత్తారు. పంట ఆశించిన స్థాయిలో ఉన్న సమయంలో వర్షాలు రావడంతో రైతులకు ఊరట కలిగింది. ఏపుగా ఎదిగి ఉన్న పత్తి పంట కురిసిన వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నది. చేలల్లో నీరు నిలిచి పత్తికాయలు రాలిపోవడమే కాకుండా పత్తి మొక్కలు కూడా నిలువునా మురిగిపోయాయి. ప్రస్తుతం పూత, పత్తి కాయలతో కళకళాడాల్సిన చేన్లు ఎక్కడ చూసినా నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రంగు మారుతున్న పంట..

పత్తి రైతుల ఆశలపై వరుణదేవుడు నీళ్లు చల్లాడు. పదహేను రోజులుగా కురిసిన వర్షాలకు పత్తి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. పత్తి పంట ప్రస్తుతం పూత, కాయ దశలో ఉంది. అధిక వర్షాలకు గూడ రాలిపోతుండగా, పత్తి కాయలు నల్లబడి రాలిపోతున్నాయి. దీంతో పంట పూర్తిగా రంగుమారుతోంది. వర్షాలు ఇలాగే కొనసాగితే పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి వచ్చేట్టులేదు



నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా. ముందుగా వర్షాలు సరిగా కురవలేదు. దీంతో రెండోసారి విత్తనాలు విత్తాను. ఇప్పుడు పంట ఏపుగా కుదురుకుంటున్న సమయంలో ఎడతెరిపిలేని వానలతో గూడరాలి పోతోంది. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

– రాపోల్ బాల్‌రాజ్, రైతు మల్లారెడ్డిగూడ, షాబాద్

పత్తిచేను ఎర్రబారింది



వరుసగా కురుస్తున్న వర్షాలకు పంట ఎర్రబడుతోంది. ఇప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టినం. దిగుబడి మాత్రం వచ్చేలా కనిపించడం లేదు. ప్రతీ సంవత్సరం ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నాం. ఈ ఏడాది లాభాలు వస్తాయని ఆశించాం. ప్రస్తుతం పంటలను చూస్తే పెట్టుబడలు వచ్చినా నయం అనిపిస్తోంది.

– విజయభాస్కర్‌రెడ్డి, రైతు, మరియాపురం, షాబాద్

సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

జిల్లా అధికార ప్రతినిధి కందూరు శ్రీధర్‌రెడ్డి



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి

షాబాద్: బీజేపీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కందూరు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కక్కులూర్ గ్రామంలో పోలింగ్ బూత్ నెంబర్ 210, 2011లో బూత్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ తిరిగి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపడుతున్నట్లు చెప్పారు. దేశంలో బీజేపీని అతిపెద్ద రాజకీయ పార్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తమ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, విష్ణు, సురేశ్, నరేశ్, రాము, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



షాబాద్: సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాబాద్: షాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాల 2000–2001 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఎంఎస్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 201 మందికి గాను 140 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా 9 మంది మృతి చెందిన పూర్వవిద్యార్థులకు, ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. మౌనం పాటించారు. ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేశ్‌గౌడ్, మహేందర్‌గౌడ్, సత్యనారాయణ, రాము, ఇమ్రాన్, చంద్రశేఖర్‌గౌడ్, కుమార్, రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, డాక్టర్ ఇమ్రాన్ జమున, అరుణ, కరుణశ్రీ, యశోధ, ఉపేంద్ర, సుమతి, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

షాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1984–85 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని అన్‌మోల్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారందరూ పాఠశాలలో చదువుకున్న రోజులను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు వెంకట్‌యాదవ్, వెంకట్‌స్వామి, శ్రీను, సత్యనారాయణగౌడ్, మాధవి, వినోద్, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, కురణశ్రీ, లలిత, రమదేవి, అనిత, తదితరులు ఉన్నారు.

దేవునిఎర్రవల్లి పాఠశాలలో..

చేవెళ్ల: మండలంలోని దేవుని ఎర్రవల్లి గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్ విద్యార్థులు 25 సంవత్సరాల వేడుకలను ఆదివారం పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో జ్ఞాపకాలను అందరి సమక్షంలో గుర్తుచేసుకున్నారు.



షాబాద్: విద్యార్థులతో ఉపాధ్యాయులు



చేవెళ్ల: దేవునిఎర్రవల్లిలో..

సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

షాద్‌నగర్‌రూరల్: దేశ సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఈవెంట్ ఆర్గనైజర్ శ్రావణ్ ఆధ్వర్యంలో పట్టణంలో మొదటిసారి మయుక్త దాండియా నైట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఈ ప్రోగ్రాంకు సంబంధించిన టికెట్లను బుక్ చేసుకునే వెబ్‌సైట్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి ఐదు టికెట్లను బుక్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన దేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శమన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇలాంటి ఈవెంట్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. పట్టణ సమీపంలోని ఏపీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఈ ఈవెంట్‌కు నియోజకవర్గంలోని ప్రజలందరూ పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంసాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, సరాపు రమేశ్, పెంద్యాల జగదీశ్వర్, కొమ్ము కృష్ణ, శ్రవణ్, పవన్, రిషి, శ్రీవాత్సవ్, వైష్ణవి, రామ్మోహన్, శ్రీనివాస్, రాజేశ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ చైర్మన్‌కు సన్మానం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట హనుమాన్ దేవాలయ అభివృద్ధి కమిటీ నూతన చైర్మన్‌గా గ్రామానికి చెందిన నారం దినేశ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదివారం దినేశ్‌రెడ్డిని ఆయన మిత్రబృందం శాలువాతో ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో దేవాలయ అభివృద్ధికి మా వంతు సహకారాన్ని అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో నల్లమోని జగన్, రాజ్‌సర్కార్, మఠం రిషికేశ్, రవితేజ, రమేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



దినేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న మిత్రబృందం

పేదల పక్షాన నిరంతర పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్



జెండా ఆవిష్కరణలో సామెల్, తదితరులు

ఇబ్రహీంపట్నం: పేదల పక్షాన నిరంతరం పోరాడేది సీపీఎం పార్టేనని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ 3వ శాఖ మహాసభ స్థానిక వెంకటేశ్వరనగర్ వెంచర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు, కర్షకులు, కూలీలు, పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎంకు అండగా ఉండాలన్నారు. వార్డుల వారీగా ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ మహాసభలో భవిష్యత్ ప్రణాళిక రూపొందించి ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంకానున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు.

మహాసభ కార్యదర్శిగా మల్లెల్ల దశరథ

అంబేడ్కర్ శాఖ 3వ మహాసభ కార్యదర్శిగా మల్లెల దశరథను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దశరథ మాట్లాడుతూ.. తనకు ఈ పదవినిచ్చిన వారి ఆశలు వమ్ము చేయకుండా పార్టీ అభ్యున్నతికి శాయశక్తుల కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యదర్శి చింతపట్ల ఎల్లేష్, సభ్యులు ఏర్పుల వీరేశం, యెలమోని స్వప్న, షేఫిఉన్నిసా, చెనమోని శంకర్, నర్సింహ్మా, శుకూర్, సయ్యిఫ్, ప్రదీప్, బంటి, ప్రమోద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంత్యోత్సవాలు



విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేస్తున్న సంఘం నాయకులు

కందుకూరు: శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని నేదునూరులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం నాయకులు సిరిగిరి ముకుందాచారి, రామకృష్ణాచారి, బ్రహ్మచారి, ఈశ్వర్‌చారి, నర్సింహాచారి, దేవజీ శ్రీనివాస్, జగన్‌చారి, గణేశ్‌చారి, మధుసూదనాచారి, సద్గుణాచారి, పవన్‌చారి ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, గంగుల కృష్ణారెడ్డి, రాకేశ్‌గౌడ్, రవీందర్‌గౌడ్, సోమరాజు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే గ్రామం.. రెండు భాగాలు



ఎల్కగూడను రెండుగా విడగొడుతున్న రోడ్డు



ఎల్కగూడ గ్రామం

- ప్రత్యేక జీపీగా ఎల్కగూడ సగ భాగం
- కుత్బుద్దీన్‌గూడ జీపీకి అనుబంధంగా మరో సగం
- ఒకే పంచాయతీగా మార్చాలంటూ గ్రామస్తుల వినతి

మొయినాబాద్: ఊరు ఒక్కటే.. కానీ ఆ ఊరికి గ్రామ పంచాయతీలు రెండు. సగం గ్రామం గ్రామ పంచాయతీగా మారితే.. మరో సగం మాత్రం ఇంకో గ్రామ పంచాయతీకి అనుబంధగా ఉంది. అసలే చిన్న ఊరు.. అదీ రెండు పంచాయతీల పరిధిలో ఉండటంతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతోంది. ఇది ఎల్కగూడ గ్రామం పరిస్థితి.

రెండు విభాగాలుగా..

మండలంలోని ఎల్కగూడ గ్రామాన్ని 2018 ఆగస్టులో ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేసింది. అంతకు ముందు ఆ గ్రామం పెద్దమంగళారం గ్రామ పంచాయతీకి సగం, కుత్బుద్దీన్‌గూడ గ్రామ పంచాయతీకి సగం అనుబంధంగా ఉండేది. రెండు గ్రామాల రెవెన్యూ శివారుల్లో ఉన్న ఎల్కగూడ గ్రామం రెండు పంచాయతీలకు సగం సగం అనుబంధంగా కొనసాగింది. అయితే 2018 ఆగస్టులో ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే ఎల్కగూడ గ్రామం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. పెద్దమంగళారంకు అనుబంధంగా ఉన్న సగం గ్రామాన్ని మాత్రమే ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసి కుత్బుద్దీన్‌గూడకు అనుబంధంగా ఉన్న మరోసగాన్ని మాత్రం అధికారులు దానికే అనుబంధంగా ఉంచారు. దీంతో ఎల్కగూడ కొత్త పంచాయతీగా ఏర్పడినా మరో సగ భాగం మాత్రం అనుబంధ గ్రామంగానే కొనసాగుతూ వస్తోంది.

రోడ్డే గ్రామాన్ని విడదీస్తుంది

ఎల్కగూడ గ్రామం అంతా ఒకేచోట ఉన్నా ప్రస్తుతం సగం గ్రామ పంచాయతీ, సగం కుత్బుద్దీన్‌గూడకు అనుబంధంగా ఉంది. ప్రత్యేక పంచాయతీగా, అనుబంధంగా ఆ గ్రామాన్ని రోడ్డే రెండు వైపులా విడగొడుతోంది. రోడ్డుకు ఎడమ వైపున ఉన్నది ఎల్కగూడ గ్రామ పంచాయతీ. కుడి వైపున ఉన్నది కుత్బుద్దీన్‌గూడ పంచాయతీకి అనుబంధంగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేసే సమయంలో ఆ మొత్తం గ్రామాన్ని కలిపి ప్రత్యేక పంచాయతీగా చేయాలని అధికారులు భావించారు. అందుకు అనుగుణంగా పెద్దమంగళారం గ్రామ పంచాయతీలో పాలకవర్గం తీర్మానం చేసింది. కానీ కుత్బుద్దీన్‌గూడ గ్రామ పంచాయతీలో మాత్రం ఎల్కగూడను ప్రత్యేక పంచాయతీ చేయొద్దంటూ తీర్మానం చేసి అధికారులకు అందజేశారు. దీంతో మొత్తం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా చేయకుండా పెద్దమంగళారంకు అనుబంధంగా ఉన్న భాగాన్ని మాత్రమే ప్రత్యేక పంచాయతీగా చేశారు.

ఒకే గ్రామంలో రెండు రకాల పాలన

ఎల్కగూడ గ్రామంలో రెండు రకాల పాలన జరుగుతోంది. సగ భాగం ప్రత్యేక పంచాయతీగా సగం గ్రామం మాత్రం కుత్బుద్దీన్‌గూడ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉంది. 2019 ఫిబ్రవరి నుంచి 2024 జనవరి చివరివరకు సగం ఎల్కగూడ గ్రామానికి సర్పంచ్, వార్డు సభ్యుల పాలన కొనసాగింది. మరోసగానికి మాత్రం కుత్బుద్దీన్‌గూడ పంచాయతీ పాలన జరిగింది. ప్రస్తుతం ఏ అవసరానికైనా కుత్బుద్దీన్‌గూడకే వెళ్లాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. గత ఎనిమిదినెలల క్రితమే సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే మొత్తం గ్రామాన్ని ఒకే పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఇటీవల గ్రామస్తులు అధికారులకు, మంత్రులకు విన్నవించారు. రెండు పంచాయతీలుగా ఉండటంతో గ్రామంలో అభివృద్ధి జరగడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ఒకే పంచాయతీగా మార్చాలి



ఎల్కగూడ సగం గ్రామాన్నే గ్రామ పంచాయతీ చేశారు. ఇంకా సగం గ్రామం కుత్బుద్దీన్‌గూడకు అనుబంధంగా ఉంది. ఎల్కగూడ గ్రామం మొత్తాన్ని ఒకే పంచాయతీగా ఏర్పాటు చేయాలని అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చాం. అధికారులు చొరవ చూపి ఒకే పంచాయతీ ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుంది.

– కుమార్, మాజీ సర్పంచ్, ఎల్కగూడ

నివేదిక పంపాం



కుత్బుద్దీన్‌గూడ పంచాయతీకి అనుబంధంగా ఉన్న ఎల్కగూడ గ్రామాన్ని ఎల్కగూడ గ్రామ పంచాయతీలో కలపాలని గ్రామస్తులు విన్నవించారు. రెవెన్యూ అధికారుల సహకారంతో గ్రామంలో సర్వే నిర్వహించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను జిల్లా అధికారులకు పంపాం.

– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్